




# కరపత్రం


SINCE 2014

గురువారం ఫిబ్రవరి 06 2025 | సంపుటి :0 | సంచిక : 115 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తజనం

## పుణ్యస్నానం ఆచరించిన ప్రధాని మోడీ



ప్రయాగ్‌రాజ్,అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభ మేళా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ కోట్లాది మంది వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మౌని అమావాస్య రోజు జరిగిన దుర్ఘటన తప్ప అన్ని రోజులు సజావుగా సాగుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ కూడా బుధవారం పుణ్యస్నానం ఆచరించారు. భీష్మ అష్టమి సందర్భంగా ఆయన ప్రయాజ్ రాజ్ వచ్చి త్రివేణి సంగంలో స్నానమాచరించి, సూర్యుడికి తర్పణం వదిలారు. సరిగ్గా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ప్రధాని మోదీ హాజరయ్యారు.ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడి నుంచి అరైల్ ఘాట్‌కు వెళ్లారు. అరైల్ ఘాట్ నుంచి బోటులో ప్రయాణించి మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం గంగా, యమునా, సరస్వతి త్రివేణి సంగమంలో ప్రధాని మోదీ పుణ్యస్నానం ఆచరించారు. తిరిగి బోటులో ఆ ప్రాంతం నుంచి అరైల్ ఘాట్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత అరైల్ ఘాట్ నుంచి ప్రయాగ్‌రాజ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి తిరిగి ఢిల్లీ బయల్దేరుతారు. మోదీ పర్యటన నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ నగరంతోపాటు కుంభమేళా దగ్గర భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక జనవరి 13న ప్రారంభమైన మహాకుంభమేళా ఈ నెల 26న మహా శివరాత్రి రోజున ముగియనుంది. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు త్రివేణి సంగమానికి పోటెత్తారు భక్తులు. ప్రయాగ్‌రాజ్ ఘాట్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటి వరకు 38కోట్ల మంది కుంభమేళాకు వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. సామాన్యులతోపాటు అనేక మంది ప్రముఖులు కూడా ఈ కుంభమేళాకు హాజరవుతున్నారు.

# పార్టీ నియమాలు పాటించని వారిపై చర్యలు:

## టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

- కాంగ్రెస్‌లో ఎంతటివారైనా పార్టీ నియమాలకు కట్టుబడి ఉండాలి.
- నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయి.
- పీసీసీ కమిటీలో 50-60% ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం.
- బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ న్యాయం జరగడం లేదని ఆవేదన.



హైదరాబాద్: కాంగ్రెస్‌లో ఎంతటివారైనా పార్టీ నియమాలకు కట్టుబడి ఉండాల్సిందేనని, పార్టీ నియమాలు పాటించని వారిపై చర్యలు ఉంటాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ కమిటీలో 50-60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉంటారని తెలిపారు. మెజార్టీలుగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా న్యాయం జరగటం లేదన్నారు.

మిగతాది 2లో

# క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా..

## ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

- ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆమెకు రూ.కోటి నజరానా ప్రకటించారు.
- మహిళా క్రికెటర్ గొంగడి త్రిషను సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.
- త్రిషకు రూ.1 కోటి నజరానా ప్రకటించగా, ధ్రుతి కేసరి, కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు.
- అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో త్రిష అత్యుత్తమ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయడంతో ఈ గౌరవం లభించింది.





హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ని భారత మహిళా క్రికెటర్ గొంగడి త్రిష మర్యాదపూర్వకంగా కలిశారు. ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రిషను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆమెకు రూ.కోటి నజరానా ప్రకటించారు. అండర్ 19 ప్రపంచకప్ టీమ్‌లో మరో సభ్యురాలు ధ్రుతి కేసరి, టీమ్ హెడ్‌కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు. త్రిషను సత్కరించిన సీఎం.. భవిష్యత్‌లో దేశం తరపున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ఆరంభం నుంచి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో త్రిష అదరగొట్టింది. టీమ్‌ఇండియా కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.

## ఎస్సీ వర్గీకరణ.. లోపాలు సరిదిద్దాలి: మందకృష్ణ మాదిగ

- ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ


2

## రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు.. డిక్లరేషన్లన్నీ బూటకమే: కేటీఆర్



2

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ స్వాధీనం



2

## మండుతున్న ఎండలు..

### తెలంగాణలో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు

తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరిలోనే వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి.

2 లో

## తితిదే కీలక నిర్ణయం..

### హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు

తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచనలతో నిర్ణయం. 2023 నవంబరు 18న బోర్డు తీర్మానం మేరకు చర్యలు.

2 లో

## సంపాదకీయ

### పన్ను రాయితీలతో ఆర్థికాభ్యుదయమా?

పాత పార్లమెంట్ భవనంలోని రీడింగ్ రూమ్ పై భాగంలో వివిధ సంస్థానాధీశుల రాచరిక చిహ్నాలు కనపడతాయి. స్వాతంత్ర్యం రాకముందు ఈ రీడింగ్ రూమ్ సంస్థానాధీశుల ఛాంబర్‌గా ఉండేది. రాజులు పోయారు, రాచరిక చిహ్నాలు పోయాయి. స్వాతంత్ర్యం తర్వాత సామాన్యులు పార్లమెంట్‌లో ప్రవేశించడం ప్రారంభమైంది. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నేతలు సైకిల్‌పై కూడా పార్లమెంట్‌కు వచ్చేవారు. మరి ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి? సంస్థానాధీశులకు బదులు ఇప్పుడు కోట్లకు పడగెత్తినవారు పార్లమెంట్‌లో ప్రవేశిస్తున్నారు. తెలుగుదేశం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తే అది ఒక అరుదైన దృశ్యంలా కనిపిస్తోంది. అసలు సంపన్నులు కాని వారు పార్లమెంట్ సభ్యులు కావడం అరుదుగా మారింది. 18వ లోక్‌సభలో 93 శాతం మంది ఎంపీలు కోటీశ్వరులైతే, కోటీశ్వరులు కానివారు పార్లమెంట్‌కు రావడం అసాధ్యమని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ తెలిపింది. రూ.10 కోట్లకు పైగా ఆస్తులు సంపాదించిన ఎంపీలు 42 శాతం మంది ఉన్నారు. లోక్‌సభ పరిస్థితి ఈ విధంగా ఉంటే, రాజ్యసభలో సంపన్నులు కానివారు ప్రవేశించడం అతి కష్టంగా మారింది. మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తుల సగటు విలువ రూ.87 కోట్లు దాటితే బీజేపీకి చెందిన 90 మంది రాజ్యసభ ఎంపీల ఆస్తుల విలువ రూ.37 కోట్లకు పైగా ఉంటుంది. పట్టణాల్లో నివసించేవారి సగటు ఆస్తుల విలువ కంటే ఎంపీల ఆస్తులు 27 రెట్లు ఎక్కువ ఉంటుందని ఒక అధ్యయనం పేర్కొంది.

భారతదేశంలో సంపన్నులూ%-%మధ్యతరగతికీ మధ్య సంపద విషయంలో వ్యత్యాసం చట్టసభల్లోనే స్పష్టంగా కనబడుతుంది. ఒకప్పుడు కేవలం రూ. 10 కోట్లతోనే దేశం మొత్తం ఎన్నికలు జరిగేవి. ఇప్పుడు వేల కోట్లు ఎన్నికల్లో ప్రవహిస్తున్నాయి. సంపన్నులకు అన్ని రకాల రాయితీలు, లక్షల కోట్ల రుణాలు, ప్యాకేజీలు, నల్లధనం పెంచుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు ఎన్నికలను ప్రభావితం చేసేందుకు, చట్ట సభల్లో ప్రవేశించేందుకు దోహదం చేస్తుంటే, సామాన్యులను శాంతింపచేసేందుకు రేషన్‌తో పాటు రకరకాల ఉచితాలు, పథకాలు, మహిళా సమ్మాన్ యోజన వంటి తాయిలాలు ప్రకటిస్తున్నారు. ఇదీ మన దేశ రాజకీయాల్లో పరిఢవిల్లుతున్న ప్రజాస్వామ్యం!

కేవలం సైద్ధాంతిక నిర్ణయాల ద్వారా భావోద్వేగాలను రేకెత్తించి మధ్యతరగతిని ఆకట్టుకోవడం సాధ్యపడదని బీజేపీ గ్రహించినట్లు కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టం, రామమందిర నిర్మాణం వంటివి ఎన్ని జరిగినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి అంతగా ప్రయోజనం కలగలేదు. ఏమీ ఖర్చుపెట్టకుండానే, రకరకాల పన్నుల ద్వారా వారి జేబులకు కత్తెర వేస్తూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ, నిత్యావసర వస్తువులు ఆకాశానికి పెరిగిపోయినా విస్మరిస్తూ ఉంటే మధ్యతరగతి ఎంతకాలం మౌనం పాటిస్తారు? మెజారిటీ జీఎస్టీ వసూళ్లు మధ్యతరగతి నుంచే లభిస్తున్నాయని ఒక అంచనా. స్కూలు ఫీజుల్లో కూడా జీఎస్టీ వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్లు చెల్లించే పన్నులకంటే వ్యక్తిగత పన్నుల వసూళ్లు దాదాపు రూ. 2లక్షల కోట్లు ఎక్కువ. వ్యక్తిగత పన్నుల వసూళ్లు 19 శాతం పెరిగితే కార్పొరేట్ పన్ను వసూళ్లు 7 శాతమే పెరిగాయి. ఇందుకు కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే. ఉదాహరణకు 2019 సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. బ్యాంకులకు లక్షల కోట్లు ఎగ్గొట్టిన సంపన్నులను ఏమీ చేయడం లేదనే ఒక అభిప్రాయం నెలకొని ఉన్నది. కార్పొరేట్లు తాము ఆర్జించిన మొత్తాన్ని పెట్టుబడులు పెడతారని, ఉద్యోగాలు కల్పిస్తారని ప్రభుత్వం ఆశించింది కాని అది జరగలేదు సరికదా. వారు తమ ఖజానాలు నింపుకున్నారు. గత దశాబ్దంలో తీవ్రమైన ద్రవ్యోల్బణం రీత్యా మధ్యతరగతి తమ ఆదాయాలు పెరగకపోవడాన్ని గమనించారు. వచ్చిన డబ్బులన్నీ మళ్లీ ఏదో రూపేణా లాగేసుకుంటున్నట్లు వారు గమనించారు.బహుశా అన్ని విధాల నష్టపోతున్నది మధ్యతరగతి వారేనన్న అభిప్రాయం గత కొద్ది సంవత్సరాలుగా నెలకొని ఉన్నది. ఆ మధ్యతరగతిని శాంతింపచేయడం కోసమే రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టమవుతోంది. పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చినప్పుడే ఆర్థిక ప్రగతి సుసాధ్యమవుతుందని ప్రకటించారు. 'ఈ దేశ మధ్యతరగతి ప్రజలు, పేదలకు లక్ష్మీదేవి ఆశీర్వాదం లభిస్తుందని ఆశిస్తున్నాను..' అని బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజే మోదీ మీడియాతో అన్నారు.

## రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు..
## డిక్లరేషన్లన్నీ బూటకమే: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ఏడాదిగా విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి దేనిపైనా స్పష్టతలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ సర్కార్ పచ్చి అబద్ధాలను ప్రచారం చేసిందన్నారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, గ్యారంటీలు, డిక్లరేషన్లన్నీ బూటకమని తేలిపోయాయని చెప్పారు. ఆయన తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిదని ఎక్స్ వేదికగా విమర్శించారు.

'నిన్నటి అసెంబ్లీ సమావేశం.. తెలంగాణ ప్రజలకు రెండు విషయాలు స్పష్టం చేసింది. ఏడాది కాలంగా పూర్తిగా విఫలమవుతున్న ప్రభుత్వానికి దేనిపై కూడా స్పష్టత లేదు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసింది. అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు ఏమాత్రం క్లారిటీ లేదు.

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఎంతమాత్రం లేదని నిన్నటితో తేలిపోయింది. రిజర్వేషన్ల అంశంపై నిస్సిగ్గుగా కాంగ్రెస్ యూటర్న్ తీసుకుంది. కేంద్రంపైకి నెపం నెట్టి తప్పించుకోవాలని పన్నాగం వేసింది. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, చెప్పిన గ్యారంటీలు, చేసిన డిక్లరేషన్నీ బూటకమని తేలిపోయింది. అబద్ధాలు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న రాహుల్ గాంధీ తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిది. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధం. ఈ సర్కారు నిబద్ధత వంద శాతం నకిలీ' అంటూ ట్వీట్ చేశారు.

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ స్వాధీనం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: నగరంలో పోలీసులు భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. రూ.1.60 కోట్ల విలువైన 1300 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకుని ముగ్గురు విదేశీయులను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌తో కలిసి లంగర్‌హౌస్, హుమాయున్‌నగర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి డ్రగ్స్ పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర వెల్లడించారు.

"హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా చేయడానికి డ్రగ్ పెడ్లర్లు వచ్చినట్లు సమాచారం వచ్చింది. లంగర్‌హౌస్ పోలీసులు, నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌తో కలిసి జాయింట్ ఆపరేషన్ చేశాం. డ్రగ్ పెడ్లింగ్ చేస్తున్న ఒలివర్ అలియాస్ జాన్సన్‌ను అరెస్ట్ చేశాం. డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్న ఆఫ్రికా దేశానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నాం. జాన్సన్ జాన్ 2009లో బిజినెస్ వీసాపై ఇండియాకి వచ్చాడు. 2013లోనే వీసా గడువు ముగిసింది. భారత్‌కు వచ్చిన తరువాత డ్రగ్స్ సరఫరా చేయడం మొదలుపెట్టాడు. ఢిల్లీ నుంచి బెంగళూరుకు పెద్ద ఎత్తున డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. నైజీరియన్స్‌తో పరిచయం పెంచుకొని హైదరాబాద్, బెంగళూరుకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు గుర్తించాం. 1300 గ్రాముల ఎండీఎంఏను సీజ్ చేశాం. నిందితుడు జాన్సన్‌ను కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుంటాం. రోమియో అనే పాత నేరస్తుడిని కూడా అరెస్ట్ చేశాం" అని డీసీపీ తెలిపారు.

అఫ్జల్ గంజ్ కాల్పుల కేసులో నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ సుధీంద్ర తెలిపారు. సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారని చెప్పారు. బీదర్, అఫ్జల్ గంజ్‌లో కాల్పులు జరిపిన నిందితులు బిహార్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. నిందితులు ఇతర రాష్ట్రాల్లోనూ ఈ తరహా నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు. "అక్రమ ఆయుధాల వినియోగంపై నిఘా కొనసాగుతోంది. ఆయుధాలకు సంబంధించి గడువు ముగిసినప్పటికీ లైసెన్సులు రెన్యువల్ చేసుకోని పక్షంలో చర్యలు తప్పవు. లైసెన్సు లేకుండా అక్రమంగా ఆయుధాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.

## లావణ్యను చంపేందుకు మస్తాన్ సాయి ప్లాన్.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

హైదరాబాద్: యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన మస్తాన్ సాయి రిమాండ్ రిపోర్టులో పోలీసులు కీలక విషయాలు పేర్కొన్నారు. లావణ్యను చంపేందుకు అతడు ప్లాన్ చేసినట్లు పేర్కొన్నారు.

మస్తాన్‌సాయి, అతడి స్నేహితుడు ఖాజాకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు నిర్ధరణ అయినట్లు రిమాండ్ రిపోర్టు ద్వారా వెల్లడైంది. డ్రగ్స్ మత్తులో లావణ్య ఇంటికి మస్తాన్ సాయి వెళ్లి గొడవ చేశాడు. అతడిపై ఎన్డీపీఎస్ సెక్షన్‌ను కూడా పోలీసులు జోడించారు. మస్తాన్ సాయి ల్యాప్‌టాప్‌లో ఉన్న లావణ్య వీడియోలను రాజ్‌తరుణ్ గతంలోనే తొలగించాడు. అయితే ఆలోపే ఇతర డివైస్‌లలోకి ఆ వీడియోలను మస్తాన్ సాయి కాపీ చేసుకున్నాడు. లావణ్యను పలు మార్లు చంపేందుకు అతడు యత్నించాడు. హార్డ్ డిస్క్ కోసం ఆమెను చంపేందుకు ప్లాన్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. గత నెల 30న లావణ్య ఇంటికి వెళ్లి హత్యాయత్నం చేసినట్లు వెల్లడించారు.



మస్తాన్ సాయి అతని స్నేహితులు డ్రగ్స్‌తో పార్టీలు చేసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీకెండ్స్‌లో మస్తాన్ సాయి విల్లాలో భారీగా డ్రగ్స్ పార్టీలు జరిగేవి. మత్తులోకి జారుకున్న తర్వాత యువతులపై లైంగిక దాడికి పాల్పడేవాడు. వారితో గడిపిన సమయంలో వీడియోలు రికార్డు చేసుకున్నాడు. కొందరు యువతులు డ్రగ్స్ తీసుకుంటున్నప్పుడు వీడియోలు రికార్డు చేశాడు. అతడి హార్డ్ డిస్క్‌లో వీటిని గుర్తించారు. ప్రస్తుతం నిందితుడి సెల్ ఫోన్, హార్డ్ డిస్క్‌ను ఎఫ్ఎస్ఎల్ టీమ్ విశ్లేషిస్తోంది.

## కర్ణాటక హైకోర్టులో విజయ్ మాల్యా పిటిషన్.. బ్యాంకులకు నోటీసులు

విజయ్ మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను బ్యాంకులకు చెల్లించిన రికవరీలకు సంబంధించి అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.

దిల్లీ: బ్యాంకులకు రూ.వేల కోట్ల రుణాలను చెల్లించకుండా దేశం వదిలి పారిపోయిన విజయ్ మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనతో పాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యూబీహెచ్‌ఎల్ తదితర సంస్థల నుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను అందించాలని కోరారు.



తాజాగా న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మాల్యా తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సుమారు రూ.6,200 కోట్ల రుణాన్ని తీసుకోగా.. దీనికి సంబంధించి రూ. 14 వేల కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు.

"ఈ విషయం గురించి లోక్‌సభలో ఆర్థిక మంత్రి తెలియజేశారు. మాల్యాకు చెందిన రూ.14, 131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీ చేశాయని ఆమె తెలిపారు. ఆయన తీసుకున్న రుణంలో దాదాపు రూ.10, 200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి కూడా తెలిపారు. పూర్తి రుణం చెల్లించినప్పటికీ.. ఇంకా రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. మాల్యాకు సంబంధించిన రికవరీ చర్యలపై స్టే విధించాలని కోర్టును కోరుతున్నాను. దీనికి సంబంధించి అన్ని బ్యాంకు నుంచి అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలి" అని న్యాయవాది అభ్యర్థించారు.

వాదనలు విన్న న్యాయస్థానం.. ఈ అంశంపై స్పందించాలంటూ ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు సహా 10 బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 13లోగా స్పందన తెలియజేయాలంటూ గడువు విధించింది. ఇదిలా ఉండగా.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తూన్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఆయన హైకోర్టును ఆశ్రయించగా.. బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది.

## మండుతున్న ఎండలు..
### తెలంగాణలో ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు



మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: తెలంగాణలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఫిబ్రవరిలోనే వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో తేమ శాతం తగ్గడంతో ఎండలు పెరిగాయని.. 32 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపింది. హైదరాబాద్, నిజామాబాద్, హనుమకొండ, మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించింది. మరో వారం రోజులపాటు ఈ ఉష్ణోగ్రతలు ఇలాగే కొనసాగుతాయని.. ఆ తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

## తితిదే కీలక నిర్ణయం..
### హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు



మొదటిపేజీ తరువాయి
తిరుమల: హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో ఉన్నప్పుడు హిందూయేతర మత ఆచారాలు పాటించిన వారిపై చర్యలకు తితిదే సిద్ధమైంది. 18 మందిపై క్రమశిక్షణ చర్యలకు తితిదే ఆదేశాలు జారీ చేసింది. హిందూయేతర ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. వీఆర్ఎస్ తీసుకునే వారికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచనలతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గతేడాది నవంబరు 18న తితిదే బోర్డు సమావేశంలో చేసిన తీర్మానం మేరకు చర్యలు తీసున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పార్టీ నియమాలు పాటించని వారిపై చర్యలు:

మొదటిపేజీ తరువాయి
"కులగణన సర్వే కోసం బీసీ సంఘాలు చాలా ఏళ్లు ఎదురుచూశాయి. గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభినందించాలి. భవిష్యత్‌లో జరిగే జనాభా గణనలోనూ కులగణన అంశాన్ని చేర్చాలి. కేంద్రం చేసే జనగణనలో కులగణన కూడా చేస్తానని భాజపా చెప్పాలి. రాష్ట్రంలో 3.66 శాతం మంది మాత్రమే సర్వేలో పాల్గొనలేదు. వివరాలు ఇవ్వనివారు హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నారు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రమూ చేయని ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేసింది. చేసిన వారిని అభినందించాల్సింది పోయి దుష్ప్రచారం చేస్తున్నారు" అని మండిపడ్డారు.?

## ఎస్సీ వర్గీకరణ.. లోపాలు సరిదిద్దాలి: మందకృష్ణ మాదిగ



మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. చాలా కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని.. మాదిగల జనాభాకు తగ్గట్లుగానే రిజర్వేషన్ల వాటా ఉండాలని విన్నవించామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నివేదికలో 9శాతం రిజర్వేషన్లే దక్కుతున్నాయన్నారు.

"15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. 32 లక్షలు ఉన్న మాదిగలకు ఏ ప్రాతిపదికన తీసుకున్నా 11 శాతం రావాలి. ప్రభుత్వం ప్రతిపాదించిన రిజర్వేషన్ల పంపిణీలో లోపాలను సరిదిద్దాలి. మాకు రావాల్సిన దానికంటే 2 శాతం తక్కువ ఉన్నాయి" అని మందకృష్ణ మాదిగ అన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఫిబ్రవరి 06 2025

# ఎస్ సి వర్గీకరణ ను ఆమోదించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఆకుల రంజిత్ కరపత్రం ప్రతినిధి

- ఎస్సీ వర్గీకరణ, కుల గణనను ఆమోదించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్



గత ముప్పై సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణకు ఉద్యమిస్తున్న మాదిగల పోరాటాలు ఫలించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ, బిసి కుల గణనను ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కోరుట్లలోని టిపిఎస్ జేఏసీ కార్యాలయంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోనగిరి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పేట భాస్కర్ మాట్లాడుతూ జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదికను అమోదించిన ప్రభుత్వం ఎస్సీ 59 కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరణ చేసిందని, బిసి కల గణన సర్వే ను కూడా అమోదం తెలుపుడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశు ద్ధి కి నిదర్శనమని వెంటనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వర్గీకరణ అమలు చేయాలని పేట భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఫిబ్రవరి 7న లక్ష డప్పులు వేల గొంతుల మహా ప్రదర్శన పిలుపు బాగ పనిచేసిందని, దేశ వ్యాప్తంగా వర్గీకరణ అములు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేట భాస్కర్ స్పష్టం చేశారు. ఈసమావేశంలో టిపిఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షులు బోనగిరి మల్లారెడ్డి, రైతు విబాగం అద్యక్షులు ఎలిశెట్టి గంగారెడ్డి, జిల్లా ఉపాద్యక్షులు బండారి శంకర్, షాహిద్ మహ్మద్ షేక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జెల రాజు, అధికార ప్రతినిధి చిర్ర చందు, పట్టణ అధ్యక్షులు శనిగారపు రాజేష్ నాయకులు పోగుల శేఖర్,గణేష్,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సంఘం ఉదాతరత

ఆకుల రంజిత్ కరపత్రం ప్రతినిధి

- ఉపాధ్యాయుడి కుటుంబానికి పి.ఆర్.టి.యు.టి.ఎస్ సంఘం చేయూత



పి ఆర్.టి.యు.టి.ఎస్ సంఘ క్రియాశీల సభ్యులు లొత్తునుర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఉప్పరి గంగయ్య గారు తేదీ 31 జనవరి 2025 శుక్రవారం రోజున అనారోగ్యంతో మరణించగా, పి ఆర్ టి యు టీ ఎస్ సంఘం వారి కుటుంబానికి ఈ రోజు ఒక లక్ష రూపాయలు (?1,00,000) చెక్కును అందచేసింది.

పి ఆర్ టి యు టీ ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాళ్ళ అమర్ నాథ్ రెడ్డి గారితో పాటు
ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సంధి శ్రీనివాస్ రెడ్డి, అయిల్నేని రత్నాకర్ రావు, చీటి భూపతి రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వేణుగోపాల్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి నరేందర్. గొల్లపల్లి మండల అధ్యక్షులు రాయి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి దేవేందర్, జగిత్యాల రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి విజయ్ రావు మొదలగు వారు పాల్గొన్నారు.

# బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ బడగు బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం





- కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షులు జి రవి ముదిరాజ్

" మేడ్చల్ మల్కాజిగిరి కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి "

కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఓబిసి విభాగం చైర్మన్ మరియు తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఆదేశాల మేరకు బుధవారం రోజు సాయంత్రం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా గుండ్లపోచం పల్లి మున్సిపాలిటీలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓబీసీ అధ్యక్షులు జి రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో లోక్ సభ ప్రదాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి టీపీసీసీ అద్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ గార్ల చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేసి బాణా సంచాలు కాల్చి సంబరాలు నిర్వహించడం జరిగింది జి రవి ముదిరాజ్ మాట్లాడుతూఎన్నికల సమయంలో భారత్ జోడో యాత్ర ద్వారా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి బడుగు బలహీనవర్గాల కష్టాలు తెలుసుకున్న అగ్ర నాయకులు రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వస్తే తప్పకుండా కులగనను అమలు చేపిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో చెప్పిన విధంగా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని చెప్పిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సర కాలంలోనే బీసీ కులగనన చేపట్టి అదే విధంగా గత కొన్ని ఏళ్లుగా ఉన్నటువంటి. వర్గీకరణకు సంబంధించిన అంశాన్ని కూడా అసెంబ్లీలో తీర్మానించడం సంతోషదాయకం,బీజేపీ, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులకు గాని కేటీఆర్ కు గాని బీసీలకు మరియు బహుజనులకు ఈ కుల గణన ద్వారా జరుగుతున్న న్యాయాన్ని చూసి ఓర్చుకోలేక.దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా దొంగే దొంగ దొంగ అన్నట్టుగావారు వ్యవహరిస్తున్న తీరు ఖండిస్తున్నామని తెలియజేస్తూ..ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డినాయకత్వంలో మన రాష్ట్రంలొ బీసీ లకు అందరికి ఈ ప్రజా ప్రబుత్వంలొనే న్యాయం జరుగుతుందని చేస్తుందని అన్నారు ధేశంలో అదికారంల వున్న బీజేపీ ప్రబుత్వం కుడా తెలంగాణ ప్రజా ప్రబుత్వంను అదర్శంగా తిసుకొని ధేశం మొత్తంకూడా కుల గణన జరపాలని డిమండ్ చేసారు. దేశంలోనే మొట్టమొదటి సారిగ ఇక్కడి కాంగ్రెస్ ప్రబుత్వం తెలంగాణ రాష్ట్రం లొ కులగణన జరిపి మన దేశానికి ఒక రొల్ మోడల్ గా నిలిచిందని అన్నారు,ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ గౌడవల్లి మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బైరి ఈశ్వర్ గుండ్లపోచంపల్లి.షమీర్ పెట్. మహిళా అద్దక్ష్యులు, షమీర్ పెట్ మరియు తూముకుంట గుండ్లపోచంపల్లి మేడ్చల్ మండల మున్సిపల్ ఓబీసీ అధ్యక్షులుఅలాగే యూత్ అధ్యక్ష్యులు నవీన్ ముదిరాజ్ రవితేజ దొడ్ల మోహన్ వినోద్ గౌడ్ తదిరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ పెద్ద సంఖ్యలోపాల్గొనడం జరిగింది,

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉంది.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి తీరుతాం



" కరుణాకర్ మల్లిగారి,కరపత్రం మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి "

కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, టియుఎఫ్ఐ డిసి చైర్మన్ చల్ల నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని అసిస్ నగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇంచార్జ్ ఫామైన భీమ్ భరత్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు.ఎస్సీ వర్గీకరణ అంశంపై క్యాబినెట్ ఆమోదముద్ర తెలిపిందని అన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్.కార్పొరేషన్ చైర్మన్ బీ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ , సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి , మొయినాబాద్ మండల అధ్యక్షులు మాణయ్యా ,, మాజీ జడ్ పి టీ సి లు ,ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు అన్ని సంఘాల నాయకులు కార్యకర్తలు , మాజీ సర్పంచ్లు , మాజీ ఎం పి టి సి లు , యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్," కరుణాకర్ మల్లిగారి,కరపత్రంప్రతినిధి "



అజయ్ కుటుంబానికి అండగా ఉంటామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడఅన్నారు. గత నెల 26న ట్యాంక్ బండ్ పై నిర్వహించిన భాగ్యనగరహానికి హరతి కార్యక్రమంలో నాగారానికి చెందిన అజయ్ ప్రమాద వశాత్తు మృతి చెందాడు. బుధవారం నాగారంలోని అజయ్ ఇంటికి కిషన్ రెడ్డి విచ్చేసి కుటుంబ సభ్యులను పరమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నికలు..

- మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి..

కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 5.

వీణవంక మండలం చల్లూరు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎల్కపల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి సమ్మయ్యలు ఎన్నికయ్యారు. ఇప్పలపల్లి గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎలవేన రమేష్ ప్రధాన కార్యదర్శిగా వేల్పుల శంకర్ లు ఎన్నికయ్యారు.కోర్కల్ గ్రామ అధ్యక్షులుగా కర్ర రాం గోపాల్, రాయన వేన కుమార్ మధ్య తీవ్ర పోటీ నెల కోల్పగా వారి ఎన్నిక అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి వారంలోగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎక్కటి రఘపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, సీనియర్ నాయకులు కర్ర భగవాన్ రెడ్డి, గంగాడి తిరుపతి రెడ్డి, చిన్నాల ఐలయ్య, నల్ల కొండల్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్, కర్ర తిరుపతి రెడ్డి,పోతరవేన సతీష్, మాదాసు సునీల్, అలె మధుసూదన్, గడ్డం కుమార్,ఎండీ అజాజ్ పాషా,ఎలవేన సదయ్య,సోహెల్, గురు, పుదరి మధునయ్య, సమ్మయ్య, రాచపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వల్బాపూర్ సగర సంఘం గ్రామ అధ్యక్షుడిగా సమ్మయ్య ఎన్నిక..

కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 5.



సగర సంఘం వల్బాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏరుకొండ సమ్మయ్య సగర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వల్బాపూర్ గ్రామంలో బుధవారం గ్రామ సగర సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి కాటిపెల్లి కుమారస్వామి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలుబాల భిక్షపతి సగర సమక్షంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నలుబాల శశి సగర, కోశాధికారిగా కాటిపెల్లి వంశీ సగర, గౌరవ అధ్యక్షుడిగా నలుబాల ఐలయ్య సగర ఆయనతో పాటు పలువురు సభ్యులును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర, ప్రధాన కార్యదర్శి కట్టరాజు సగర, జిల్లా కోశాధికారి కాటిపెల్లి బాబు, రాష్ట్ర నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నలుబాల కుమారస్వామి సగర, నలుబాల మధు సగర, నలుబాల శ్రీనివాస్ సగర, నలుబాల రాకేష్ సగర తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఫిబ్రవరి 06 2025

## తాజా మాజీ కౌన్సిలర్ పునాది మల్లయ్య కు ఘన సన్మానం.......

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 5...**





కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 23వ వార్డు మాజి తాజా కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య ను కాలనివాసూలు ఘనంగా సన్మానం చేశారు.వర్డులోని ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు సకాలంలో పరిష్కరించి వార్డు అభివృద్ధికి తోడ్పడిన జమ్మికుంట మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ పోనగంటి మల్లయ్య ను వార్డు ప్రజలు,సన్నిహితులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఐదు సంవత్సరాలు కౌన్సిలర్ గా సేవలందించి ప్రజల మన్ననలు పొందారాని,అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నాడని, వార్డులో ప్రతి గల్లీలో సిసి రోడ్లు,డ్రైనేజీలు, నిర్మించి, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటింటికి నల్ల కలెక్షన్ ఇచ్చి నీటి సౌకర్యం కల్పించారని వార్డు ప్రజలు తెలిపారు.ఈ సందర్బంగా మాజి కౌన్సిలర్ మల్లయ్య మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం మున్సిపల్ కౌన్సిలర్ గెలుపు కోసం సహకరించి అత్యధిక మెజారిటీతో గెలుపుకు కారకులైన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు అభివృద్ధికి తోడ్పడిన ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో వార్డు ప్రజలు,సన్నిహితులు,అభిమానులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు మాదిగ ఎమ్మెల్యేల ఘన నివాళి...

**– మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ..**

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 5**



తెలంగాణ శాసనమండలి, శాసనసభ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం దంతో మాదిగ ఎమ్మెల్యేలందరం హైదరాబాద్ పట్టణంలో అంబేద్కర్ జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించినట్లు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడారు. తెలంగాణ శాసన మండలి శాసనసభ సమావేశంలో ఎస్సి వర్గీకరణ కు ఆమోదం.పొందిన నేపథ్యంలో హైదరాబాద్ లోని భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తోపాటు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామెల్ తదితరులు ఉన్నారు.

## అర్జీ-3 జిఎం నరేంద్ర సుధాకార్ రావుకి వినతి పత్రం

**– పన్నూర్ తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్**

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 5.**



అర్జీ-3 జిఎం నరేంద్ర సుధాకార్ రావుకి వినతి పత్రం ఇచ్చిన పన్నూర్ తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్, బుధవారం రామగిరి మండలం సెంటనరి కాలనీ లోని సింగరేణి అర్జీ-3 ఏరియా జిఎం కార్యాలయం లో జిఎం నరేంద్ర సుధాకార్ రావుని కలసి ఆర్జి-3 ఏరియా లోని పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలో పన్నూర్ గ్రామ, జోన్-1, జోన్-2, టి2, సి2, శ్రీలంక కోటర్స్ ఏరియాలో విపరీతంగా దోమల బెడద తీవ్రంగా ఉండడం వలన ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది, కావున దోమల నివారణకు ఫాగింగ్ స్ప్రే ను సంబధిత అదికారులచే చేపించగలరని వినతి పత్రం ఇచ్చిన పన్నూర్ తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్.

## నూతన బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడినీ సన్మానించిన రామగిరి మండల బిజెపి నాయకులు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఫిబ్రవరి 5.**



పెద్దపెల్లి జిల్లా బిజెపి పార్టీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కర్రు సంజీవరెడ్డి ని రామగిరి మండల బిజెపి పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం పెద్దపల్లి నందన గార్డెన్ లో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయనతో పాటు పాల్గొన్నారు. తర్వాత పార్టీ కార్యకర్తలతో నూతన అధ్యక్షుడు అనేక విషయాలపై చర్చించి రానున్న రోజులన్నీ బిజెపివేనని అన్ని మండలాల్లో, గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రామగిరి మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్, పెద్దపెల్లి జిల్లా కౌన్సిల్ మెంబర్ తొట్ల రాజు నాయకులు కందుల రమేష్, నాంసాని మహేష్, రాసూరి అరుణ్, మైదం సందీప్ పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ కు నిరసనగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లో వామపక్షాల నిరసన ప్రదర్శన ర్యాలీ

**కరపత్రం కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 5**




కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ కు, కార్మిక వ్యతిరేక యాజమాన్యల అనుకూల (4) నాలుగు కొడ్లఅమలుకు నిరసనగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్.డీ యూసుఫ్, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బుధవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఐ. డీ. ఏ. జీడిమెట్ల పారిశ్రామికవాడలో కార్మిక సంఘాలు చేపట్టిన నిరసన ప్రదర్శన లో పాల్గొన్నమన్నారు. ప్రదర్శన అనంతరం జరిగిన సభకు ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా నాయకులు ఇ. ఉమా మహేష్, ఐ ఎన్.టి.యూ.సి. రాష్ట్ర అధ్యక్షులు గుంజా శ్రీనివాస్, సి ఐ టీ యూజిల్లా నాయకులు కె. లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్. డీ. యూసుఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో కార్మిక సంక్షేమానికి ఏలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఎలాంటి కేటాయింపులు జరగలేదన్నారు. ఇది కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అవుతుందన్నారు. ఈ బడ్జెట్ లో కార్పొరేట్ కంపెనీ ల ప్రయోజనాలకు పెద్ద పీట వేశారన్నారు. అంతే కాకుండా కార్మికవర్గం గత వంద సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కార్మికులకు వ్యతిరేకం గా యాజమాన్యలకు అనుకూలంగా 4 కోడ్ లను తెచ్చి ఏప్రిల్ 1వ తేది నుండి అమలు చేస్తామని ప్రకటించడం కార్మిక వర్గాన్ని తీవ్రంగా అణిచివేయడమేనని అన్నారు. కోడ్ల అమలైతే భవిష్యతులో పర్మనెంట్ ఉద్యోగాలు ఉండకుండా పోతాయి అన్నారు. వాటి స్థానంలో కాలపరిమితితో కూడిన ఉద్యోగాలు వస్తాయన్నారు. యాజమాన్యం ఉద్యోగ కాలం నిర్ణయిస్తుందని ఇది అత్యంత ప్రమాదకరమైన దోపిడీ అని, కార్మికులు యాజమాన్యాల ముందు బానిసలుగా ఉడాల్సివస్తుందని తెలిపారు. యాజమాన్యాలు వారానికి 72గంటలు పని చేయాలిని ఒకరు అంటే, లేదు 90గంటలు పని చేయాలని మరొకరు అంటున్నారని అన్నారు. కొడ్ల ప్రకారం చట్టభద్ద సమ్మె చేయటానికి అవకాశం లేదని, సంక్షేమ పథకాలకు గ్యారెంటీ లేదని అన్నారు. కొడ్ల లో కార్మిక అనుకూల అంశాలు ఏవీ లేవని, గతంలో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను పునరుద్దరించి కొడ్లను రద్దు చేసేవరకు పోరాటం చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు.

ఐ.ఎన్.టి. యు.సి. రాష్ట్ర నాయకులు కుత్బుల్లాపూర్ మాజీ శాసన సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతు కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్ లో తెలంగాణకు తీవ్రంగా అన్యాయం జరిగిందని తెలంగాణ కు కేటాయింపులు చేయాలని డిమాండ్ చేసారు. కొడ్ల అమలు ను ఆపివేయాలని, ఇప్పుడున్న కార్మిక చట్టాలను అమలు చేయాలని లేకుంటే అన్ని కార్మిక సంఘలతో కలిసి తీవ్రస్థాయిలో పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సి. ఐ. టి. యు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీ ల ప్రభుత్వం గా పని చేస్తుందని అన్నారు. కార్మిక కర్షక వ్యతిరేకం గా విధానాలను నిర్ణయిస్తూ, రైతు వ్యతిరేక చట్టాలను కొత్త రూపంలో తేవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్ వందనసమర్పణ చేసారు. ఈ కార్యక్రమం లో ఐ. ఎన్. టి. యు. సి. నాయకులు జి. ఐలయ్య గౌడ్, ఏఐటీయూసీ నాయకులు ఎమ్. నర్సింహా రేడ్డి, బక్కరి మల్లేష్, మహేందర్, కనకయ్య, సి.ఐ.టి.యు నాయకులు అంజయ్య, దేవదానం పాల్గొన్నారు.......

## మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత

**– తల్లిదంద్రుల కష్టాన్ని గుర్తెరిగి నడుచుకోవాలి**

**ములుగు ఫిబ్రవరి 05 కరపత్రం**



“గీతాంజలి హై స్కూల్ ములుగు” విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాల గురించి, ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి అవగాహన కల్పించిన గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్ కుమార్, గజ్వేల్ షీటీమ్ బృందం ఈ సందర్భంగా రూరల్ సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతు చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. కష్టపడి చదవాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు, కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. మరియు బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు మరియు పిల్లలు ఎవరితోనైనా హింసకు ఎవరైనా హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు కానీ స్నేహితులకు కానీ చెప్పుకోవాలని సూచించారు లేనిపక్షంలో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. మహిళల పిల్లల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435 హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ 9440700906, 040-27852246 ఫోన్ చేసినచో మరియు (ఫేస్ బుక్, sdptsheteam,)(మెయిల్,sdptsheteam@gmail.com), సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ నవనీత, మరియు ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ లావణ్య, ములుగు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సోషల్ జస్టిస్ డే కాదు ఇంజస్టిస్ డే – ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

**కరపత్రం కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 5**



తెలంగాణ భవన్ లో బుధవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ తో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అసెంబ్లీ విప్ కె.పి.వివేకానంద్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ. మంగళవారం ఒకే ఒక రోజు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రధానమైన అంశాలను తగిన సమయం ఇవ్వకుండా నామమాత్రముగా బడుగు బలహీన వర్గాలపై ప్రేమ ఉన్నట్లు నటించడం బాధాకరమన్నారు. అందువల్లనే ఈ రోజును తెలంగాణ సోషల్ జస్టిస్ డే కాదు ఇంజస్టిస్ డే అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు చీకటి రోజని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ లో బాగా నటించారు. ఈ నటనను బీసీ లు ఎవ్వరూ నమ్మరని అన్నారు.1952 లో బడుగు బలహీన వర్గాల కోసం ఖేల్కర్ కమిటీ మంచి సూచనలు చేసిందన్నారు.ఆ సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు.రేవంత్ రెడ్డి అసెంబ్లీ లో మానసిక ఉన్మాది లా ప్రవర్తించారని అన్నారు.కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ కు మంగళం పాడారని తెలిపారు.

నీలం సంజీవ రెడ్డి నుంచి రేవంత్ రెడ్డి వరకు అందరూ కాంగ్రెస్ సీఎం లు బీసీ లకు మోసం చేసిన వారేనని అన్నారు. రాజీవ్ గాంధీ పార్లమెంట్ లో ఓబీసీ రిజర్వేషన్లకు ,కులగణన కు వ్యతిరేకంగా మాట్లాడాలని అన్నారు.ఈ రికార్డులు బయట పెడతామన్నారు.రేవంత్ రెడ్డి అబద్దాలతో అధికారం లోకి వచ్చారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రోజుకొక నాటకానికి తెర లేపుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చే వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటామని అన్నారు......

## ఎంపియుపిఎస్ ఆర్ అండ్ ఆర్ వన్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

**కరపత్రం గజ్వేల్ ఫిబ్రవరి 05,**




స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా పాత్ర వహించి మిగతా విద్యార్థులకు పాఠాలు బోధించడం జరిగింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్ ఎంపియుపిఎస్ ఆర్ అండ్ ఆర్ వన్ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు డి ఈ ఓ నవీన్, ఎంఈఓ ఎం అఖిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్ ఉపాధ్యాయ పాత్రలతో తోటి విద్యార్థులకు బోధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహాదేవుని భాస్కర్ మాట్లాడుతు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాత్ర వహించి పాఠశాలలోని మిగతా విద్యార్థులకు పాటలు బోధించడం జరిగిందన్నారు. దీనివల్ల నిజ జీవితంలో కూడా సమాజంలో ఏ విధంగా ఉండాలనే విషయంలో స్వీయ అనుభవం ద్వారా విద్యార్థులకు స్వయంగా తెలుస్తుందని తెలిపారు. విద్యార్థులు అందరూ వారి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అది నెరవేర్చుకునే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థులు ఇదే తొలిమెట్టుగా భావించి కష్టపడి చదివి పాఠశాలకు,మీ తల్లిదండ్రులకు పేరు తీసుకొచ్చే విధంగా అందరు బాగా చదివి పాఠశాల పేరు చిరస్థాయిగా నిలపాలని తెలియజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలపై ముఖ్య ప్రదర్శనలు, అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మంజుల, ఆర్ రేణుక, ఎం ప్రభావతి, బి గీతా మాధురి, సిహెచ్ శ్వేత, శ్రీకరి తదితరులు పాల్గొన్నారు.